క్లుప్తంగా

ఆత్మీయ భేటీ



ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన డాక్టర్ వాసుదేవరెడ్డి

బంగారుపాళెం: మద్యం అక్రమ కేసు నుంచి బెయిల్‌పై విడుదలైన రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని శుక్రవారం తిరుపతిలో రాష్ట్ర ప్రభుత్వ మాజీ వైద్య సలహాదారుడు, ఎన్ఆర్ఐ డాక్టర్ నలిపిరెడ్డి వాసుదేవరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఉద్దేశపూర్వకంగా కూటమి ప్రభుత్వం వేధింపులకు గురి చేస్తోందని, అలాగే వైఎస్సార్‌సీపీ నాయకులపై దౌర్జన్యాలు చేస్తూ.. వారిపై అక్రమ కేసులు బనాయిస్తోందని మండిపడ్డారు. దీనికి తగిన మూల్యం చెల్లించకతప్పదని ఆయన హెచ్చరించారు.

దేవస్థానానికి విరాళం



విరాళమిస్తున్న సుబ్రమణ్యం నాయుడు కుటుంబ సభ్యులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో నిత్యాన్నదాన, గోసంరక్షణ ట్రస్టుకు శుక్రవారం పూతలపట్టు మండలం కమ్మగుట్టపల్లెకు చెందిన సుబ్రమణ్యం నాయుడు రూ.లక్ష, గోసంరక్షణ ట్రస్టుకు రూ.50వేలను విరాళంగా అందజేశారు. ఆయనకు ఆలయ అధికారులు స్వామి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): గుర్తుతెలియని వ్యక్తులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను చోరీచేశారు. ఈ ఘటన చిత్తూరు మండలం, దిగువమాసాపల్లి పంచాయతీ, ఎగువకండ్రిగ గ్రామంలో చోటుచేసుకుంది. గోవిందస్వామి నాయుడు, జయరాముడు వ్యవసాయ పొలానికి అమర్చిన ట్రాన్స్‌ఫార్మర్లు గురువారం చోరీ అయ్యాయి. గుర్తుతెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌ను కిందికి దింపి అందులోని రాగి తీగలను ఎత్తుకెళ్లిపోయారు. దీనిపై బాధిత రైతు లు బీఎన్ఆర్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా 15 రోజుల క్రితం దిగువమాసాపల్లిలో ఓ రైతు ట్రాన్స్‌ఫార్మర్ కూడా చోరీకి గురైంది. వరుస చోరీలతో రైతుల్లో గుబులు పట్టుకుంది.

లాటరీ టికెట్ల విక్రేత అరెస్టు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని పాత బస్టాండులో లాటరీ టికెట్లు విక్రయిస్తున్న రాజేష్ (28)ని వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. కొంగారెడ్డిపల్లెకు చెందిన రాజేష్.. బస్టాండులో లాటరీ టికెట్లు విక్రయిస్తుండగా అతని వద్ద నిషేధిత లాటరీ టికెట్లతో పాటు, రూ.12 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మహేశ్వర తెలిపారు.

'నగరి డాక్టర్ ఇక్కడికొచ్చి వైద్యం!'



రోగి వివరాలు నమోదు చేసుకుంటున్న నగరి ఏరియా ఆస్పత్రి డాక్టర్ భవ్య

తవణంపల్లె: స్థానిక పీహెచ్‌సీ వైద్యులు ముగ్గురు సమ్మెబాట పట్టారు. దీనితో నగరి ఏరియా హాస్పిటల్ చెవి, ముక్కు,గొంతు(ఈఎన్‌టి) సర్జన్ డాక్టర్ భవ్య శుక్రవారం తవణంపల్లె పీహెచ్‌సీలో విధులకు హాజరయ్యారు. పీహెచ్‌సీ డాక్టర్లు సమ్మెకు వెళ్లడం వల్లే తనకు ఇక్కడ డ్యూటీ వేశారని, రోగులకు ఎలాంటి సమస్య లేకుండా వైద్యసేవలు అందిస్తున్నట్టు ఆమె పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలోని పట్టు రైతులకు నాణ్యమైన క్రిమిసంహారక మందులు సరఫరా చేయాలని జిల్లా పట్టు పరిశ్రమ అధికారి పద్మమ్మ తెలిపారు. ఈనెల 6వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 13వ తేదీలోపు దరఖాస్తులను పూర్తిచేసి ఇరువారం ప్రాంతంలోని జిల్లా పట్టు పరిశ్రమ కార్యాలయంలో సమర్పించాలని ఆమె కోరారు.

ఇంటి దొంగలపై వేటు

పలమనేరు: ఏరియా ఆస్పత్రిలో విలువైన సామగ్రిని తస్కరించి సొమ్ము చేసుకున్న నలుగురు సిబ్బందిని విధుల నుంచి తొలగించినట్టే సూపరింటెండెంట్ డాక్టర్ మమతారాణి తెలిపారు. ఆస్పత్రిలోని విలువైన వస్తువులను చోరీ చేసి గుజిరీ దుకాణంలో రహస్యంగా విక్రయించిన విషయం వెలుగుచూసింది. ఈ విషయం మీడియాకు తెలియకముందే నలుగురి సిబ్బందిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ వేటువేశారు. నిందితులపై పోలీసులకు ఫిర్యాదు చేశారా లేదా అనే విషయం తెలియాల్సి ఉంది.

గాంధీ మార్గమే ఆదర్శం



జిల్లాలో జైలులో కలెక్టర్ సమక్షంలో మొక్కలు నాటుతున్న లయన్స్ క్లబ్ సభ్యులు



చిత్తూరు గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న విజయానందరెడ్డి, పార్టీ నాయకులు

చిత్తూరు అర్బన్: జాతిపిత మహాత్మా గాంధీ జయంతి పురస్కరించుకుని అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయనకు ఘన నివాళులర్పించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ తన కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం నగరంలోని గాంధీ విగ్రహానికి మేయర్ అముద, ఎమ్మెల్యే జగన్‌మోహన్ నాయుడుతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ, దేశానికి అహింసాయుత పద్ధతిలో స్వాతంత్ర్య సాధనతో పాటు గ్రామ స్వరాజ్యం కోసం గాంధీజీ చేసిన కృషి చరిత్ర మరువదన్నారు. అలాగే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి నియోజకవర్గ సమన్వయకర్త విజయానంద రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీ మార్గమే తమకు ఆదర్శమన్నారు. మునిసిపల్ కార్యాలయంలోని గాంధీ విగ్రహానికి మేయర్, కమిషనర్ నరసింహ ప్రసాద్ తదితరులు నివాళులర్పించారు. చిత్తూరులోని జిల్లా జైలులో గాంధీ జయంతి నేపథ్యంలో ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహించారు. కలెక్టర్, న్యాయమూర్తులు శ్రీనివాసరావు, పద్మజ, ఎమ్మెల్యే, జైళ్ల అధికారులు వెంకటరెడ్డి, శ్రీనివాసులు, కుమారస్వామి, అంజి నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి ఉత్తీర్ణులైన ఖైదీలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అలాగే జైలు ఆవరణలో మొక్కలు నాటారు.

జాతిపిత అడుగు జాడల్లో పయనిద్దాం

బంగారుపాళెం: జాతిపిత మహాత్మాగాంధీ, స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతిని గురువారం మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ పురుషోత్తం, ఉద్యోగులు గాంధీ, శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశానికి స్వాతంత్ర్యం తేవడంతో గాంధీ చేసిన అహింసాయుత పోరాటం, దేశానికి ప్రధానికి శాస్త్రి అందించిన సేవలను ప్రస్తుతించారు. అలాగే, మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాలలో గ్రామసభలు నిర్వహించారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మహాత్ముడి ఆశయ సాధనకు కృషి చేద్దాం

గుడిపాల: మహాత్ముడి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీఎస్ఆర్ కళాశాల అధినేత లోకేష్‌రెడ్డి అన్నారు. గాంధీ జయంతి పురస్కరించుకుని గాంధీజి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కళాశాలలో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, గాంధీని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు.





మునిసిపల్ కార్యాలయంలో గాంధీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మేయర్, కమిషనర్, గుడిపాల: సీఎస్ఆర్ కళాశాలలో ..

భక్తిప్రపత్తులతో విజయదశమి

బంగారుపాళెం: మండలంలో విజయదశమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. చివరిరోజు మండలంలోని వజ్రాలపురం బోయకొండ గంగమ్మ ఆలయంలో చండీయాగం, ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. స్థానిక గ్రామదేవత ముత్యాలమ్మ ఆలయం, ఓటికే వీధిలోని సత్యమ్మ ఆలయం, రాజావీధిలోని ఓంశక్తి ఆలయం, మొగిలివెంకటగిరిలో గంగమ్మ ఆలయం, బ్రహ్మనందాశ్రమంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే, విజయదశమి రోజున వ్యాపారస్తులు దుకాణాలకు, వాహనదారులు వాహన పూజలు చేశారు.

మహిషాసురమర్దిని అలంకారంలో..

ఐరాల: మండలంలో పాతపాళ్యంలోని ఓం శక్తి గురువారం సాయంత్రం మహిషాసుర మర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారిని వివిధ పుష్పాలతో అలంకరించి, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

చిత్తూరులో..

చిత్తూరు రూరల్(కాణిపాకం) : చిత్తూరు గిరింపేటలోని దుర్గాంబ దేవస్థానంలో అమ్మవారు గురువారం రాత్రి పుష్పరథంలో ఊరేగారు. ఆ తర్వాత వసంతోత్సవం నిర్వహించారు. అమ్మవారు నగరవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. గుర్రప్పనాయుడువీధిలోని అంకాళపరమేశ్వరి ఆలయంలో శ్రీరాజరాజేశ్వరిదేవిగా, ముత్యాలమ్మ ఆలయంలో రాజరాజేశ్వరి అలంకరణలో, కోదండరామస్వామి ఆలయంలో కృష్ణావతారంలో, సాయిబాబా ఆలయంలో రాజరాజేశ్వరిదేవిగా అభయమిచ్చారు.



బంగారుపాళెం: వజ్రాలపురంలో..



ఐరాల: పాతపాళ్యంలో..

పంచాయతీ అభివృద్ధికి కృషి : ఎంపీపీ



మాట్లాడుతున్న ఎంపీపీ ప్రతాప్ సుందర్ రాయల్ రెడ్డి

తవణంపల్లె: పంచాయతీల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని ఎంపీపీ ప్రతాప్‌సుందర్‌రాయల్ రెడ్డి కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీలకు సొంత ఆదాయ వనరులు సమకూర్చుకోవడంపై శిక్షణా తరగతులు ఏర్పాటు చేశారు. ఎంపీపీ జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. పన్నులు వసూలు చేసి పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. కూలీలకు విరివిగా ఉపాధి పనులు కల్పించాలన్నారు. ఎంపీడీఓ రెడ్డిబాబు మాట్లాడుతూ, పీఎంజీవై పథకం కింద ఎంపికైన గ్రామాల్లో నిధులు సద్వినియోగం చేసుకొని అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక(జీపీడీపీ)ను గ్రామ సభలు నిర్వహించాలని, అవసరమైన పనులను గుర్తించి, ప్రణాళిక తయారు చేయాలని ఆదేశించారు. పంచాయతీల్లో నీళ్ల ట్యాంకులను నెలకు రెండు సార్లు శుభ్రం చేయాలని, పైపులైన్లు లీకేజీ లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ సుకుమార్ రెడ్డి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రాజ్యాంగ నిర్మాతకు ఇంత అవమానమా?

చిత్తూరు రూరల్: వెదురుకుప్పం మండలం దేవళంపేటలో డాక్టర బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన దుండగులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.గంగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఈ దుశ్చర్యను ఖండిస్తూ చిత్తూరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ, ప్రజలలో మత విద్వేషాన్ని రెచ్చగొడుతున్న బీజేపీ సహకారంతో ప్రభుత్వం నడుస్తున్న కూటమి నాయకుల వికృత చేష్టల వలనే రాజ్యాంగ నిర్మాతకు ఇంత అవమానం జరిగిందని దుయ్యబట్టారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని కాల్చడం దురదృష్టకరం

అణగారిన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు పోరాడిన భారత రాజ్యాంగ నిర్మాత డా.బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహం తగులబెట్టడం దురదృష్టకరమని బీజేపీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీశ్వర నాయుడు, శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించారు. దోషులు ఎంతటి వారినైనా వారిని చట్టం ముందు నిలబెట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఆ దుర్మార్గులను కఠినంగా శిక్షించాలి

తవణంపల్లె: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన దుర్మార్గులకు ప్రభుత్వం వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని మండల దళిత యువజన సేవా సంఘం నాయకులు మురుగన్, జగన్నాథం, షణ్ముగం, పరదేశి తదితరులు డిమాండ్ చేశారు. వెదురుకుప్పం మండలంలోని దేవళంపేటలోని ప్రధాన కూడలిలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టడం హేయమైన చర్య అని నిరసన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టడం హేయం

ఐరాల: గంగాధర నెల్లూరు నియోజకవర్గం వెదురుకుప్పం మండలంలోని దేవళంపేటలో గురువారం రాత్రి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టడం హేయమైన చర్య అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి దొరబాబు, పూతలపట్టు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రామచంద్ర శుక్రవారం ఓ ప్రకటనలో ఖండించారు. ఈ చర్యను ప్రజాస్వామ్యంపై దాడిగా పరిగణించి, పోలీసులు నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కూటమి పాలనలో దళితులకు రక్షణ కరువు

చిత్తూరు రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 15 నెలల కాలంలో దళితులకు రక్షణ కరువైందని చిత్తూరు మాల మహానాడు, వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షుడు రమేష్ విమర్శించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పూతలపట్టు మండలానికి చెందిన ఒక దళిత యువతిపై జరిగిన అత్యాచార ఉదంతంలో దోషులను ఇంతవరకు శిక్షించకుండా జాప్యం చేయడం కూటమి ప్రభుత్వానికి దళితులపై చూపుతున్న వివక్షకు నిదర్శనమన్నారు. అగ్రకులానికి చెందిన వారు బాధితులైతే వెంటనే చర్యలు తీసుకునే ఈ ప్రభుత్వం దళితుల విషయంలో నిరాసక్తత చూపుతోందని ఆరోపించారు. అలాగే, వెదురుకుప్పం మండలంలోని దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోకుండా వారిని కాపాడే యత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. జిల్లాలో ఉన్న ముగ్గురు దళిత ఎమ్మెల్యేలు ఏ ఒక్కరు కూడా ఈ దుర్ఘటనపై ఖండించకపోవడం శోచనీయమన్నారు.

ఆదాయం పెంపుపై దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ కుమార్

గుడిపాల: పంచాయతీలు ఆదాయం పెంపుపై దృష్టి పెట్టాలని ఎంపీడీఓ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సర్పంచులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామ పంచాయతీలు సొంతంగా ఆదాయం ఎలా పెంచుకోవాలో ఎంపీడీఓ మాట్లాడారు. ప్రతి గ్రామంలో ఇంటిపన్నును తప్పనిసరిగా వసూలు చేయాలని, అలాగే మండలంలో అధికంగా గ్రానైట్ ఫ్యాక్టరీలు, క్వారీలు, జ్యూస్ ఫ్యాక్టరీలు ఉన్నాయని, వాటి వల్ల రాబడిని పెంచుకోవాలన్నారు.

స్కూళ్లకు దాతల వితరణ



స్టీల్ అక్షరాలతో నామఫలకాన్ని అందించిన దాతలు

గుడిపాల: మండలంలోని నరహరిపేట జెడ్పీ హైస్కూల్ ప్లస్‌లో నామ ఫలకాన్ని స్టీల్ అక్షరాలతో మండలానికి చెందిన చంద్రశేఖరనాయుడు, హనుమంతనాయుడు వేయించారు. దీంతో పాటు 500మందికి స్టీల్‌ప్లేట్లను అందజేశారు. తన తండ్రి తుమ్మల సాంబశివనాయుడు జ్ఞాపకార్థం కుమార్తె లలిత విద్యార్థులకు క్రీడా సామాగ్రి వితరణ చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఈఓ చిన్నతంబి, ప్రధానోపాధ్యాయులు దూర్వాసులు, సీఎస్ఆర్ కళాశాల వ్యవస్థాపకులు లోకేష్, అధ్యాపకులు అర్జున్ పాల్గొన్నారు.

ముగిసిన నవరాత్రి ఉత్సవాలు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక దేవస్థాన అనుబంధ మణికంఠేశ్వరస్వామి ఆలయంలో గురువారం నవరాత్రి ఉత్సవాలు పరిసమాప్తమయ్యాయి. అమ్మవారికి ఉదయం అభిషేక పూజలు, సాయంత్రం ప్రత్యేక కుంకుమార్చన, నిష్ఠతో జమ్మిచెట్టుకు పూజలు చేశారు. అనంతరం అమ్మవారు మహిషాసురమర్దినిగా భక్తులను కటాక్షించారు. అనంతరం వేడుకగా గ్రామోత్సవం నిర్వహించారు. దీనికి కాణిపాక మాజీ చైర్మన్ మోహన్ రెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



గ్రామోత్సవంలో అమ్మవారు





జమ్మిచెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు, హాజరైన భక్తులు

ఆయుధ పూజకు పోటెత్తిన వాహనాలు



కిటకిటలాడుతున్న ఆయుధ పూజ ప్రాంగణం

కాణిపాకం: విజయదశమి పర్వదినం పురస్కరించుకుని శుక్రవారం ఆయుధ పూజలకు కాణిపాకం వాహనాలతో పోటెత్తింది. వాహన మండపంలో ద్విచక్రవాహనం నుంచి కార్లు, పెద్ద వాహనాల సైతం బారులు తీరాయి. ఉదయం నుంచి రాత్రి వరకు కూడా వాహన పూజ మండపం భక్తజనంతో రద్దీగా కనిపించింది. వాహన మండపంలోని అర్చకులు వాహనాలకు పూజలు చేసి పూజాసామగ్రి అందజేశారు.

ఘనంగా పోలీసుల ఆయుధ పూజ

చిత్తూరు అర్బన్: చిత్తూరులోని జిల్లా ఆర్మడు రిజర్వు పోలీసు కార్యాలయంలో ఆయుధపూజ ఘనంగా నిర్వహించారు. పోలీసులు ఉపయోగించే ఆయుధాలు, వాహనాలకు గురువారం ఎస్పీ తుషార్ డూడీ, ఆయన సతీమణి, కుటుంబ సమక్షంలో పూజలు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలు శాంతి, సుఖాలతో సంతోషంగా ఉండాలంటే పోలీసులు ఉపయోగించే ఆయుధాలే కీలకమన్నారు. వీటి వాడకంలో క్రమశిక్షణ, నిబద్ధత ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, డీఎస్పీలు సాయినాథ్, మహబూబ్ బాషా, పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చిత్తూరులో తుపాకులకు ఆయుధ పూజ చేస్తున్న ఎస్పీ తుషార్ డూడీ

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల కోసం ఎన్‌సీడీ క్లినిక్

– జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుధారాణి

బంగారుపాళెం: దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఎన్‌సీడీ క్లినిక్ ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి వెల్లడించారు. శుక్రవారం స్థానిక కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో ఏర్పాటు చేయనున్న ఎన్‌సీడీ క్లినిక్‌కు అవసరమైన వసతులపై సిబ్బందితో ఆమె సమీక్షించారు. దీర్ఘకాలిక వ్యాధులైన రక్తపోటు, మధుమేహం, గుండెజబ్బు, క్యాన్సర్ వంటి వ్యాధులతో బాధపడుతున్న వారికి ఉచితంగా, మెరుగైన వైద్యం అందివ్వాలన్నదే ఎన్‌సీడీ క్లినిక్ ఏర్పాటు ముఖ్యోద్దేశమన్నారు. త్వరలో ఇక్కడ దీనిని అందుబాటులోకి తెస్తామన్నారు. అనంతరం పాలేరు, టేకుమందలో నిర్వహిస్తున్న 104 వైద్య సేవల వాహనాలను సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. కార్యక్రమంలో డీపీఎంఓ ప్రవీణ, సీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ శిరీష, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎన్‌సీడీ క్లినిక్‌పై సిబ్బందితో సమీక్షిస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుధారాణి

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన ర్యాలీ



జీఎస్టీ తగ్గింపుపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

గుడిపాల: జీఎస్టీ తగ్గింపుపై స్థానిక వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. తొలుత ఎంపీడీఓ కుమార్, వ్యవసాయాధికారి సంగీత నేతృత్వంలో ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ట్రాక్టర్, వ్యవసాయ యంత్ర పరికరాలు, సూక్ష్మపోషకాలు, బయో–పెస్టిసైడ్స్, స్ప్రింకర్లు, డ్రిప్ పరికరాలు మొదలైన వాటిపై జీఎస్టీ 12శాతం నుంచి 5శాతానికి తగ్గించిందని, ఫలితంగా వీటి రేట్లు తగ్గాయన్నారు. రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీపై శుక్రవారం మండల కేంద్రంలో అధికారులు ట్రాక్టర్లతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జీఎస్టీ తగ్గడం వల్ల వ్యవసాయ పరికరాలు తక్కువ ధరకు కొనుగోలు చేయవచ్చని రైతులకు తెలియజేశారు. జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ డి. రజని, ఇన్‌చార్జి ఎంపీడీఓ రెడ్డిబాబు, మండల వ్యవసాయాధికారి జి.ప్రవీణ్, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



తవణంపల్లెలో..

భక్తిశ్రద్ధలతో ఇరుముడులు

ఐరాల: మండలంలో నెల్లిమందపల్లెలోని సల్లాపురమ్మ ఆలయంలో గురువారం అమ్మవారికి భక్తులు ఇరుముడులు సమర్పించి మొక్కులు చెల్లించారు. ప్రతి ఏటా విజయ దశమి రోజు ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అక్కడి నుంచి కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి కాలినడకన వెళ్లి, అక్కడ మాలలు ధరించి తిరిగి సల్లాపురమ్మ ఆలయానికి చేరుకుని ఇరుముడులు చెల్లించడం ఆనవాయితీ.



మాలలు ధరించి సల్లాపురమ్మ ఆలయానికి బయలుదేరుతున్న భక్తులు